క్లుప్తంగా

విద్యార్థుల ప్రతిభ

సింహాద్రిపురం: అనంతపురంలో ఈనెల 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో సింహాద్రిపురం పాలిటెక్నిక్ విద్యార్థులు ప్రతిభ చూపారని కళాశాల ప్రిన్సిపల్ కె.తాతాజీ పేర్కొన్నారు. సోమవారం స్థానిక సింహాద్రిపురం ప్రభుత్వ పాల్‌టెక్నిక్ కళాశాలలో ఆయన మాట్లాడుతూ సింహాద్రిపురం ప్రభుత్వ పాల్‌టెక్నిక్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ సెకండియర్ చదువుతున్న సి.కార్తీక్‌రెడ్డి వాలీబాల్ ఇండియా జట్టుకు ఎంపికయ్యారన్నారు. అలాగే కంప్యూటర్ బ్రాంచ్ తృతీయ సంవత్సరం చదువుతున్న మణికంఠ ట్రిపుల్ జంప్‌లో రాష్ట్రస్థాయి ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. హెచ్‌ఓడీలు శివశంకర్, త్రినాథ, విద్యార్థులను అభినందించారు.

నేడు సమావేశం

జమ్మలమడుగు : జమ్మలమడుగ నియోజకవర్గంలోని తహసీల్దార్, సెక్టోరియల్ అధికారులతో ఆర్డీఓ కార్యాలయ సభాభవనంలో ఎన్నికల నిర్వహణపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఆర్డీఓ జి.శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 10:30 నిమిషాలకు అధికారులందరూ హాజరు కావాలని సూచించారు. అదేవిధంగా 12గంటలకు పొలిటికల్ సమావేశాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు.

పిల్లలకు అభ్యసన సామగ్రి పంపిణీ

ఎర్రగుంట్ల : పట్టణంలోని సెకండ్ వార్డులో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని పిల్లలకు అభ్యసన సామగ్రిని అందజేసినట్లు మండల విద్యాధికారి శివప్రసాద్ తెలిపారు. భక్తుల దస్తగిరి వర్ధంతి సందర్భంగా ధర్మపత్ని భక్తుల వెంకట లక్షుమ్మ పిల్లలకు అభ్యసన సామగ్రి అందజేశారు. హెచ్‌ఎం ప్రభాకర్‌రెడ్డి, పాల్గొన్నారు.

ఘన స్వాగతం



రసూల్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పులివెందుల టౌన్ : దూదేకుల, నూర్ బాష సంఘ కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేశాక తొలిసారి పులివెందులకు వచ్చిన ఓతూరు రసూల్‌కు సోమవారం ఆయన అభిమానులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, దూదేకుల, నూర్ బాష సంఘ నాయకులు ఘన స్వాగతం పలికారు. అంతకుముందు స్థానిక మార్కెట్ యార్డు సమీపంలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి చైర్మన్ రసూల్ పూలమాల వేసి నివాళులర్పించారు.

వంతెన ప్రారంభం

వీరపునాయునిపల్లె : మండలంలోని యస్ పాలగిరి సచివాలయ పరిధిలోని ఓబుల్‌రెడ్డిపల్లె గ్రామం వద్ద రూ.57లక్షలతో నిర్మించిన వంతెనను సోమవారం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలకు వాగు ఉధృతంగా ప్రవహించే సమయంలో గ్రామస్తులు రాకపోకలకు ఇబ్బందులు పడేవారన్నారు. ప్రస్తుతం వంతెన ఏర్పాటుతో గ్రామస్తుల కష్టాలు తొలగిపోయాయన్నారు. మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, సర్పంచులు విజయ్‌కుమార్ యాదవ్, సురెంద్ర కుమార్ యాదవ్, ఎంపీటీసి భీముడు, మాజీ ఎంపీపీలు వీరయ్యయాదవ్, గోవిందురెడ్డి పాల్గొన్నారు.

ఆవోపా అధ్యక్షుడిగా సునీల్

వేంపల్లె : ఆర్యవైశ్య ఆఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఆవోపా) మండల అధ్యక్షుడిగా సునీల్‌కుమార్ ఇటీవల ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం స్థానిక శ్రీవాసవీ కళ్యాణ మండపంలో నూతన ఆవోపా కార్యవర్గ సభ్యులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ ఆవోపా ద్వారా పేదలకు వివిధ రకాల వైద్య సేవలతో పాటు ఇతరత్రా సేవలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఆవోపా ఉపాధ్యక్షుడు దొంతు లక్ష్మిశ్రేష్టి, ద్వారకనాథ, కార్యదర్శి కృష్ణకిశోర్, కోశాధికారి సతీష్ పాల్గొన్నారు.

నేడు జగనన్న సురక్ష

వీరపునాయునిపల్లె : మండలంలోని గంగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉదయం 10గంటలకు జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడత కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు కల్లూరు రఘునాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గంగిరెడ్డిపల్లె, సంగాలపల్లె, మిట్టపల్లె గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

హ్యాండ్‌బాల్ జట్టుకు ఎంపిక

పులివెందుల రూరల్ : అనంతపురం విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్న వివిధ కళాశాలలకు చెందిన క్రీడాకారులు హ్యాండ్‌బాల్ జట్టుకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ రమణారెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక జేఎన్‌టీయూ కళాశాలలో ఆయన మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు తమిళనాడు రాష్ట్రంలోని సేలంలో ఈనెల 10వ తేదీనుంచి 10 తేదీవరకు జరిగే హ్యాండ్ బాల్ టోర్నమెంట్‌లో పాల్గొంటారన్నారు. విద్యార్థుల ఎంపికపై హ్యాండ్ బాల్ కోచ్‌లు డేవిడ్, కుమార్, సుబ్బారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

కొనసాగుతున్న ధర్నా

ఎర్రగుంట్ల : డాక్టరు ఎంవీఆర్ ఆర్టీపీపీలో పని చేస్తున్న ఉద్యోగుల నెల వేతనాలు కోసం చేస్తున్న ధర్నా సోమవారం రెండవ రోజు చేరింది. అన్ని యూనియన్ల నాయకులతో పాటు ఉద్యోగులు పవర్ హౌస్ గేటు వద్ద నిరసన చేపట్టారు.

పింఛన్ పెంపు చరిత్రాత్మకం



లబ్ధిదారులకు పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : రాష్ట్రంలోని పింఛన్ దారులకు పెన్షన్‌ను రూ.3వేలకు పెంచడం చరిత్రాత్మక నిర్ణయమని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక వీఆర్‌యస్ డిగ్రీకళాశాల మైదానంలో మండల అభివృద్ధి అధికారి ఆధ్వర్యంలో పింఛన్ పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలోని ఏ రాష్ట్రంలో ఇంత పెద్ద మొత్తం పింఛన్ పంపిణీ చేయలేదని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎం వైఎస్ జగన్ 3వేల రూపాయలకు పింఛన్ పెంచారన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు జన్మభూమి కమిటీ సభ్యులు సూచించిన వారికి మాత్రమే పింఛన్ మంజూరయ్యేదని అంతే కాకుండా ఏ రోజు పింఛన్ ఇస్తారోనని అవ్వలు, తాతలు ఎదురు చూసేవారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రతి నెలా 1వ తేది ఉదయాన్నే తలుపుతట్టి పింఛన్ ఇవ్వడం జరుగుతోందన్నారు. తెలుగుదేశం నాయకులు చెబుతున్న అబద్ధపు వాగ్దానాలు నమ్మి మోసపోవద్దని సూచించారు. నిత్యం రాష్ట్ర ప్రజల మంచి గురించి ముందు చూపుతో ఆలోచించే వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అని ఆయన్ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలియజేశారు. వీరపునాయునిపల్లె మండలంలో 5186మంది పింఛన్‌దారులకు నేటి నుంచి 3వేల రూపాయలు అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండపానికి భూమి పూజ

మండలంలోని సంగమేశ్వరాలయ ప్రాంగణంలో తిరుమల తిరుపతి దేవస్థానం వారు శ్రీ వాణి ట్రస్టు ద్వారా 2కోట్ల రూపాయలతో నిర్మించబోతున్న కళ్యాణ మండపం నిర్మాణ పనులకు సోమవారం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్యాణ మండపం నిర్మించేందుకు ముందుకు వచ్చిన తిరుమల తిరుపతి దేవస్థానం వారికి, కళ్యాణ మండపం మంజూరు కోసం ఆర్థిక సహకారం అందించిన షిర్డి సాయి ఎలక్ట్రికల్ అధినేత విశ్వేశ్వర్‌రెడ్డికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. సంగమేశ్వర స్వామి దేవాలయం వద్ద శుభకార్యాలు నిర్వహించుకునే భక్తులకు కళ్యాణ మండపం ఎంతో ఉపయోగపడుతుందని తెలియజేశారు. రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథ రెడ్డి, ఆలయ చైర్మెన్ శివాంజనేయరెడ్డి, ఈఓ జగన్‌మోహన్‌రెడ్డి, ఆలయ అర్చకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, భక్తులు పాల్గొన్నారు.



కల్యాణ మండపం నిర్మాణానికి భూమి పూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

ప్రజా సంక్షేమం.. జగనన్న అభిమతం

ఎమ్మెల్యే డాక్టరు ఎం సుధీర్‌రెడ్డి



ఇంటింటి ప్రచారం చేస్తూ ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే డాక్టరు ఎం.సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభిమతమని జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టరు మూలె సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం యర్రగుంట్ల పట్టణంలోని 7వ వార్డులో మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్ రెడ్డితో కలసి గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ ప్రజలతో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలను 99శాతం నెరవేర్చారన్నారు. అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత, విద్యాదీవెన, వసతి దీవెన, రైతు భరోసా, పింఛన్లు, నాడు–నేడు తదితర పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ యర్రం రెడ్డి శ్రీధర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డితో పాటు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.50 వేలు విరాళం : ఈ సందర్భంగా ఈ వార్డులో ఉన్న శ్రీరామాలయం ధూప నైవేద్యాల కోసం రూ.50 వేలు నగదును జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టరు ఎం సుధీర్‌రెడ్డి అందజేశారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన యువకులు



కండువా కప్పి పార్టీలోనికి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

జమ్మలమడుగు : మైలవరం మండల నవాబు పేట గ్రామానికి చెందిన పలువురు యువకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నవాబు పేట గ్రామానికి చెందిన యువకులను ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు. జిల్లా ఉపాధ్యక్షుడు ధన్నవాడ మహేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలి



అభివృద్ధి పనులపై అధికారులతో చర్చిస్తున్న మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్ రెడ్డి

ఎర్రగుంట్ల : యర్రగుంట్ల మున్సిపల్ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను శర వేగంగా పూర్తి చేయాలని యర్రగుంట్ల మున్సిపల్ చైర్మన్ మూలె హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. సోమవారం మున్సిపల్ చైర్మన్ చాంబర్‌లో అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఎమ్మెల్యే డాక్టరు ఎం సుధీర్‌రెడ్డి సారథ్యంలో యర్రగుంట్ల మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. పనులలో ఎలాంటి ఆలస్యం లేకుండా నాణ్యతగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ ఆర్‌ఓ గంగిరెడ్డి, ఏఈ సురేష్, కౌన్సిలర్ మహమ్మద్‌ఆలీ, పార్టీ నాయకులు డెవిడ్, కాంట్రాక్టర్ రామసుబ్బారెడ్డిలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పులివెందుల రూరల్ : పట్టణంలోని పార్నపల్లె రోడ్డు విస్తరణకు సంబంధించి కరెంటు లైన్ సిట్టింగ్ పనులు జరుగుతున్న కారణంగా మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ విద్యుత్ ఏఈ జగదీశ్వరరెడ్డి తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు, ప్రజలు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

నేడు పెన్షన్ కానుక పంపిణీ

వల్లూరు : వల్లూరులోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మంగళవారం ఉదయం 10 గంటలకు వైఎస్‌ఆర్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ జయశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వం నూతనంగా రూ. 3 వేలకు పెంచిన పెన్షన్‌లను లబ్ధిదారులకు అందచేస్తారని తెలిపారు. మండలంలోని పెన్షన్ లబ్ధిదారులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని సూచించారు.

వ్యాసరచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక సత్రంబడి ఉన్నత పాఠశాలలో సోమవారం మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు మానవత విలువల మీద వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు హెచ్‌ఎం చంద్రశేఖరరావు చేతలమీదుగా బహుమతులను ప్రదానం చేశారు. మానవత సంస్థ చైర్మన్ డి.వి.కొండారెడ్డి, సెక్రటరీ చంద్రశేఖర రెడ్డి, డైరెక్టర్ ఎస్.విశ్వనాథ రెడ్డి, కోశాధికారి హరిశ్చంద్రారెడ్డి పాల్గొన్నారు.

పర్యాటక రంగంపై అవగాహన అవసరం

వేంపల్లె : చారిత్రాత్మక కట్టడాలపై ప్రజలలో అవగాహన కల్పించి ప్రచారం చేస్తే పర్యాటక రంగం దిన దినాభివృద్ధి చెందుతుందని కళాశాల ప్రిన్సిపల్ సి.యోగాంజనేయులు అన్నారు. ఆధునిక కాలంలో చారిత్రాత్మక పర్యాటక కేంద్రాలు పర్యాటకులను ఎంతో ఆకర్షిస్తున్నాయని ప్రిన్సిపల్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల చరిత్ర విభాగాధిపతి బాలకొండ గంగాధర రాష్ట్ర సదస్సులో పత్ర సమర్పణ సందర్భంగా ఆయన స్పందించారు. ఈనెల 6,7వ తేదీలలో విశాఖపట్టణంలోని ప్రభాత్య లంకపల్లె బుల్లయ్య కళాశాలలో 46వ రాష్ట్ర వార్షిక సదస్సు కోలాహలంగా జరిగింది. ఈ సదస్సులో చరిత్ర అధ్యాపకుడు బాలకొండ గంగాధర మధ్య యుగం నాటి చారిత్రాత్మక పర్యాటక ప్రాశస్తిపై పత్ర సమర్పణ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ యోగాంజనేయులు మాట్లాడుతూ జిల్లాలోని ఒంటిమిట్ట, సిద్ధవటం, గండికోట లాంటి కట్టడాలతో పాటు ఆధ్యాత్మిక కేంద్రాలైన బ్రహ్మంగారి మఠం, తాళ్లపాక కేంద్రాలు మధ్య యుగంలో ఏర్పడ్డాయన్నారు. వీటిపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ఆదరించాలి



కిచెన్ గార్డెన్‌ను విజిట్ చేస్తున్న అడిషనల్ డీపీఎం, వెలుగు కార్యాలయ కో–ఆర్డినేటర్, ఏపీఎం

పులివెందుల రూరల్ : మండలంలోని ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయాన్ని ఆదరించాలని అడిషనల్ డీపీఎం వసంతకుమారి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని వెలుగు కార్యాలయంలో ఏడు మండలాల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, యూనిట్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అడిషనల్ డీపీఎం వసంతకుమారి, వెలుగు ఏరియా కో–ఆర్డినేటర్ నీలకంఠారెడ్డి హాజరై ప్రకృతి వ్యవసాయంలోకి రసాయన వ్యవసాయం చేసే రైతులను ఏ విధంగా తీసుకురావాలన్న దానిపై చర్చించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీపీఎం వసంత కుమారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన కూరగాయలు, ఆకు కూరలు తినాలన్నారు. అనంతరం వెలుగు ఏరియా కో–ఆర్డినేటర్ నీలకంఠారెడ్డి , ఏపీఎం గురురాజ్ మాట్లాడారు. అనంతరం వారు మండల సమాఖ్యలో కిచెన్ గార్డెన్‌ను విజిట్ చేసి అక్కడికి వచ్చిన సభ్యులకు వివరించారు. ఎస్ఎఫ్ఏ నరసింహారెడ్డి, మాస్టర్ ట్రైనర్ భాస్కర్‌రెడ్డి, ముద్దుల ప్రతాప్, యూనిట్ ఇన్‌చార్జిలు, క్లస్టర్ కో–ఆర్డినేటర్లు, అనిమేటర్లు పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సమావేశానికి మండలస్థాయి అధికారులు అభివృద్ధి ప్రగతి నివేదికలతో హాజరు కావాలన్నారు. అలాగే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు.

ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు



వేంపల్లె: శ్రీ చైతన్య పాఠశాలలో సంక్రాంతి సంబరాలు



జమ్మలమడుగు: ముగ్గుల పోటీలలో పాల్గొన్న మహిళలు

వేంపల్లె : మండల వ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. సోమవారం స్థానిక మెయిన్ బజార్‌లోని ప్రాథమిక పాఠశాల (మెయిన్) భవిత దివ్యాంగుల పాఠశాల, శ్రీచైతన్య ఉన్నత పాఠశాల ఆవరణాలలో విద్యార్థులు పండుగ సాంప్రదాయ దుస్తులతో కనువిందు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణి రెడ్డి, ఐఈఆర్టీ యశోధ, హెడ్మాస్టర్ రాజేశ్వరిలు విద్యార్థులకు ముందస్తు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాస్థాయి చెకుముకి పోటీలలో తృతీయ స్థానం కైవసం చేసుకున్న విద్యార్థులను అభినందించారు.

స్వామి వివేకానంద పాఠశాలలో..

వేంపల్లె పట్టణంలోని శ్రీస్వామి వివేకానంద ఇంగ్లీషు మీడియం ఉన్నత పాఠశాలలో సోమవారం పాఠశాల కరస్పాండెంట్ రామాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు.

వీరపునాయునిపల్లె : ఆంధ్రుల అతి పెద్ద పండుగ సంక్రాంతి అని పాయసంపల్లె జిల్లా షరిషత్ ప్రధానోపాధ్యాయుడు మురళీ కృష్ణ ప్రసాద్ అన్నారు. సోమవారం పాఠశాలలో సంక్రాంతి ముందస్తు సంబరాలు ఘనంగా నిర్వహించారు. జన విజ్ఞానవేదిక నాయకులు, ఉపాధ్యాయుడు సుజన్ కుమార్ పండుగ గురించి వివరించారు.

సంస్కృతికి ప్రతీకలు పండుగలు

జమ్మలమడుగు: పండుగలు మన సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబింపజేస్తాయని వాసవీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అర్షద్ జహా పేర్కొన్నారు. నెహ్రూ నగర్, దిగువపట్నం కాలనీ వాసులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

14 నుంచి సంక్రాంతి సంబరాలు

పులివెందుల టౌన్ : స్థానిక శిల్పారామంలో ఈనెల 14 నుంచి 16వ తేదీవరకు సంక్రాంతి సంబరాలలో భాగంగా నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలను ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని ఎంఈఓ వీరారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 14, 15వ తేదీలలో సాయంత్రం రంగువల్లుల పోటీలు నిర్వహించనున్నామని.. అలాగే గాలి పటాల పోటీలు, 16న సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని.. ఈ పోటీలలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సామాజిక న్యాయానికి మద్దతుగా ర్యాలీ



ర్యాలీలో మున్సిపల్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

పులివెందుల టౌన్ : అణగారిన వర్గాల ఆశాజ్యోతి, భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఔన్నత్యాన్ని చాటి చెప్పేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 125అడుగుల భారీ అంబేడ్కర్ విగ్రహం ప్రారంభించనున్న నేపథ్యంలో.. పులివెందులలోని 4వ వార్డు సచివాలయంలో జేసీఎస్ పట్టణ కన్వీనర్ పార్నపల్లె కిశోర్ ఆధ్వర్యంలో జన భగీథారీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి హాజరై సామాజిక న్యాయానికి మద్దతుగా ప్రజలతో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వీధులగుండా ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గండి ఆంజనేయులు, ఫైర్ రామకృష్ణ, ఈశ్వరయ్య, నవీన్ కుమార్, కిరణ్, చాంద్ బాషా పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో వాల్మీకుల ఆత్మీయ సమావేశం



సమావేశమైన వాల్మీకుల సంఘ ప్రతినిధులు, సభ్యులు

సింహాద్రిపురం : మండల కేంద్రమైన సింహాద్రిపురంలో సోమవారం వాల్మీకుల సంఘ జిల్లా అధ్యక్షుడు సాకే ఆదినారాయణ అధ్యక్షతన వాల్మీకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వాల్మీకుల సమస్యలతోపాటు సంఘ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు, వాల్మీకి విగ్రహ ప్రతిష్ట గురించి చర్చించారు. అనంతరం వాల్మీకుల సంఘ జిల్లా అధ్యక్షుడు ఆదినారాయణ మాట్లాడుతూ ఎస్టీ సాధన ప్రధాన లక్ష్యంగా ఏపీ వాల్మీకి సంఘ నిర్మాణం జరిగిందన్నారు. వాల్మీకుల సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

‘ఆడుదాం ఆంధ్రా’ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న చెన్నూరు ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్

చెన్నూరు : ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి క్రీడా పోటీలు మండల వ్యాప్తంగా ఈనెల 10వ తేదీ నుంచి మొదలు కానున్నాయని.. దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ వెంకటసుబ్బయ్య, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్ తెలిపారు. మండల సభా భవనంలో పంచాయితీ కార్యదర్శులకు అలాగే పీఈటీలకు క్రీడా పోటీల గురించి పలు సూచనలు సలహాలు అందజేశారు. తహసీల్దార్ పఠాన్ అలీ ఖాన్ ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం శర్మ, డాక్టర్ బి చెన్నారెడ్డి, ఎంఈఓ2 సునీత ఈఓపీఆర్డి సురేష్ బాబు, కార్యదర్శులు, పీఈటీలు పాల్గొన్నారు.

10 నుంచి మండల స్థాయి పోటీలు

కమలాపురం : మండల స్థాయి ఆడుదాం..ఆంధ్రా క్రీడా పోటీలను ఈ నెల 10 వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు మండల స్పెషలాఫీసర్ నరసింహారెడ్డి, ఎంపీడీఓ జ్యోతి తెలిపారు. సోమవారం వారు సీఎస్ఐ చర్చి మైదానంతో పాటు గురుకుల పాఠశాల గ్రౌండ్‌ను పరిశీలించారు. ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి ఆదేశాలతో జెడ్పీటీసీ సుమిత్రా రాజశేఖర్ రెడ్డి తన సొంత నిధులతో సీఎస్ఐ చర్చి గ్రౌండ్‌ను అన్ని విధాలా సిద్ధం చేశారు. ఈ మైదానంలో క్రికెట్, వాలీబాల్, గురుకుల మైదానంలో హాకీ, బ్యాడ్మింటన్, ఖో–ఖో క్రీడలు నిర్వహించనున్నారు. కమిషనర్ రాముడు, ఎంఈఓ బేబి, ఈఓఆర్డీ శారదారెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, కౌన్సిలర్ నిఖిల్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి మండలస్థాయి పోటీలు

లింగాల : ఆడుదాం ఆంధ్రాలో భాగంగా మండల కేంద్రమైన లింగాల పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న ఆట స్థలంలో మంగళవారం నుంచి కబడ్డీ, ఖో ఖో మండలస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సురేంద్రనాథ్ తెలిపారు. సచివాలయ పరిధిలో గెలుపొందిన క్రీడాకారులు మండలస్థాయి పోటీలలో పాల్గొనాలని సూచించారు. అదేవిధంగా ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

మత సామరస్యానికి ప్రతీక పీర్ల చావిడి, అంజన్న గుడి



విగ్రహ ప్రతిష్ఠకు ముస్తాబైన ఆంజనేయస్వామి ఆలయం

పులివెందుల టౌన్ : పట్టణంలోని నగరిగుట్ట 26వ వార్డులో పూర్వ కాలం నుంచి కుళ్లాయిస్వామి పీర్ల చావిడి, శ్రీఆంజనేయస్వామి గుడి వైఎస్సార్ కుటుంబ సభ్యులచేత ఆదరించబడుతోంది. దీంతో పీర్లచావిడిని పాడా నిధులతోనూ, శ్రీఆంజనేయ స్వామి గుడిని దేవదాయ ధర్మాదాయ శాఖల ద్వారా నూతన ఆలయాన్ని సర్వాంగ సుందరంగా నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణ పనులను తమిళనాడుకు చెందిన వారిచే దేవస్థాన నిర్మాణ పనులు చేపడుతున్నారు. ప్రతిష్టలో భాగంగా సోమవారం ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈనెల 10వ తేదీన బుధవారం ఆంజనేయసావమి మూల విగ్రహం, ధ్వజ శిఖర, కలశ ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, ప్రాణ ప్రతిష్ట, భక్తులకు అన్నదాన కార్యక్రమం, రాత్రికి గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు పండితులు తెలిపారు.

అంగన్వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కమలాపురం : కమలాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న ఒక కార్యకర్త, 4 ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ వసంత బాయి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమలాపురం ప్రాజెక్ట్ పరిధిలో వీఎన్ పల్లె మండలం తంగేడుపల్లె (ఆర్‌ఆర్ కాలనీ) సెంటర్‌లో కార్యకర్త పోస్టు (ఎస్‌సీ), అదే మండలంలోని ఉరుటూరు–1 (ఈడబ్ల్యుఎస్), నేల తిమ్మాయపల్లె (ఎస్‌టీ), వల్లూరు మండలం చిన్నపుత్త (బీసీ–సీ), కొప్పోలు మెయిన్ (బీసీ–ఎ) అభ్యర్థులకు రోస్టరు ప్రకారం కేటాయించామన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులై, 2023 జూలై 1 నాటికి 21 సంవత్సరాలు పూర్తి అయి, 35ఏళ్ల లోపు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని ఆమె అందులో పేర్కొన్నారు. ఈ నెల 11 లోపు దరఖాస్తు ప్రాజెక్ట్ కార్యాలయంలో అందజేయాలని, పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి

కమలాపురం : కేంద్ర ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జ్యోతి తెలిపారు. సోమవారం మండలంలోని సి.గోపులాపురం, పొడదుర్తిలో వికసిత భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి సంచార టీవీ వాహనం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ జ్యోతి సంకల్ప ప్రతిజ్ఞ చేయించారు.

ఆరోగ్య శ్రీ కార్డులు పంపిణీ



లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ, తదితరులు

వేంపల్లె : మండలంలోని ఆయా సచివాలయాల పరిధిలో దాదాపు 11,977 ఆరోగ్యశ్రీ పథకం కొత్త కార్డులు లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ దివిజ సంపతి పేర్కొన్నారు. సోమవారం స్థానిక గరుగువీధిలో ఎంపీపీ లక్ష్మీగాయత్రితో కలిసి ఆమె లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం ఆరోగ్యశ్రీ పథకం ద్వారా లభించే సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మండల వ్యాప్తంగా 18సచివాలయాల పరిధిలో 15,065 కుటుంబాలు ఆరోగ్యశ్రీ కార్డుకు అర్హత ఉండగా.. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ మొదటి విడత కింద 11977మంది లబ్ధిదారులకు కొత్త కార్డులు మంజూరయ్యాయని.. మిగిలిన వారికి రెండవ విడతలో కార్డులు మంజూరవుతాయన్నారు. మండల ఉపాధ్యక్షుడు బాబా షరీఫ్, ఎంపీటీసీలు కటిక చంద్రశేఖర్, మణిగోపాల్‌రెడ్డి, హబీబుల్లా, రాజ్‌కుమార్, పీహెచ్‌సీ డాక్టర్ స్వాతిసాయి, వైద్య, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మోడల్ టెస్ట్ పేపర్స్ పంపిణీ

చెన్నూరు : మండలంలోని కొండపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు పి.వి.ఎస్ నారాయణ సోమవారం వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం మోడల్ టెస్ట్ పేపర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాను పదవ తరగతి వరకు కొండపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్నానని తను చదివిన పాఠశాలకు ఏదైనా చేయాలనే సంకల్పంతో ప్రతి సంవత్సరం తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం పదవ తరగతి చదివే విద్యార్థులందరికీ మోడల్ టెస్ట్ పేపర్లు పంపిణీ చేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.